

బస్తీ దవాఖానా ఇన్‌చార్జి ప్రవల్లికతో కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

బస్తీ దవాఖానాలో కార్పొరేటర్ ఆకస్మిక తనిఖీలు

చిక్కడపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): టీఆర్‌టీ క్వార్టర్స్‌లోని బస్తీ దవాఖానాలో గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ ఆకస్మిక తనిఖీలు బుధవారం నిర్వహించారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన చికిత్సలు పొందలేని పేదప్రజల కోసం ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాల్లోని పరిస్థితులను, చికిత్స కోసం వచ్చే రోగులకు అందుతున్న సదుపాయాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బస్తీ దవాఖాన ఇన్‌చార్జి డా.ప్రవల్లికతో కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ పరిస్థితులపై సమీక్షించారు. బస్తీ దవాఖానా ద్వారా మంచి చికిత్సతోపాటు నాణ్యమైన ఔషధాలు అందేలా చూడాలని కార్పొరేటర్ ఈ సందర్భంగా డాక్టర్ ప్రవల్లికకు సూచించారు. బస్తీ దవాఖానాలో కావాల్సిన సదుపాయాల కొరత ఉంటే తమ దృష్టికి తేవాలని వాటిని సమకూర్చేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ డాక్టర్ ప్రవల్లికతోపాటు బస్తీ దవాఖానా సిబ్బందితో అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, సంయుక్త రాణి, దవాఖాన నర్సు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడు గోపాల్‌రావుకు నివాళి

బర్కత్‌పుర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ నింబోలిఅడ్డలో నివాసం ఉంటున్న తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ కార్పొరేటర్ ఎస్.గోపాల్‌రావు మృతదేహానికి పలువురు నివాళులర్పించారు. మంగళవారం గోపాల్‌రావు మృతి చెందిన విషయం విదితమే. ఆయన మృతికి హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, కార్పొరేటర్ కన్నె ఉమాదేవిలు సంతాపం తెలిపారు. అంబర్‌పేట హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు బుధవారం జరిగాయి. అంతిమయాత్రలో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామితో పాటు పలువురు తెలంగాణ ఉద్యమకారులు నివాళులర్పించారు.



నల్లకుంట స్ట్రీట్ నంబర్ 18, 17లలో పగలు వెలుగున్న వీధి దీపాలు

పగలు వెలుగుతున్న వీధిదీపాలు

నల్లకుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వీధిదీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పలు ప్రాంతాల్లో వీధిదీపాలు రాత్రి వెలగడం లేదు. మరికొన్ని చోట్ల పగలు సైతం వీధి దీపాలు వెలుగులు విరజిమ్ముతున్నాయి. పాత నల్లకుంట శంకరమఠం మార్కెట్ రోడ్డులో మూన్‌కేఫ్ ఎదురు వీధి 18, హనుమాన్ ఆలయం ఎదురుగా ఉన్న స్ట్రీట్ నంబర్ 17లో గత కొద్ది నెలలుగా పగలు రాత్రి తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతున్నాయి. ఈ విషయంపై విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించిన సమస్య పరిష్కారానికి సరైన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. టైమర్లు పనిచేయకపోవడం వల్ల కొన్ని వీధుల్లో రాత్రి, పగలు వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఇకనైనా విద్యుత్ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్, హైదరాబాద్ సిటీ-1 పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు నాగేశ్వరరావు, వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీక్రాస్‌రోడ్, గోశాల 11 కేవీ ఫీడర్ల పరిధిలోని అంబేడ్కర్‌నగర్, అచ్చయ్యనగర్, లోయర్‌ట్యాంక్‌బండ్, తాతానగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, లేపాక్షి, కవాడిగూడ పరిధిలోని తపాడియా డయాగ్నస్టిక్ సెంటర్, గోల్కొండ సిగరెట్ ఫ్యాక్టరీ, మారియట్ హోటల్, కొత్తబజార్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5, శాస్త్రినగర్ పరిధిలోని మోహన్‌నగర్, రామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో 3 నుంచి 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

అణగారిన వర్గాల ఆకాంక్షలు నెరవేరాయి

కవాడిగూడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశంలో రాజ్యాంగాన్ని అంబేడ్కర్ రాసినందు వల్లనే నేడు అణగారిన వర్గాల ఆకాంక్షలు నెరవేరాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఎస్సీ హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జరిగాయి. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చోల్లేటి ప్రభాకర్, సంఘం జాతీయ అధ్యక్షుడు రాగల నాగేశ్వరరావు, ప్రొఫెసర్ తిరుపతి, ఎన్.నరసింహారావు, సౌత్ సెంట్రల్ రైల్వే యూనియన్ నాయకుడు టాక్సీబాబు, మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి స్టాలిన్, నగర అధ్యక్షుడు గుంటి విజయబాబు, ఉపాధ్యక్షులు రాడపాక పరంజ్యోతి, నాయకులు జంగయ్య, అశోక్‌కుమార్, సీ.హెచ్.ఆనంద్‌రావు, మహేందర్; విజయరామ్, కృష్ణ, అశోక్, నాగలక్ష్మి, కుమార్, ప్రవీణ, కవిత తదితరులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న దయానంద్, నర్మెట్ట మల్లేష్

రాజ్యాంగం గురించి అందరూ తెలుసుకోవాలి

చిక్కడపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంలోని బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం ఉన్నటువంటి ఆర్టికల్స్ గురించి ప్రతిఒక్కరూ తెలుసుకుని వారి హక్కులను సాధించుకునే ఉద్యమాలు చేయాలని మాల కులాల యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మాస్టర్ దయానంద్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని మాలమహానాడు సాధనసమితి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. డిసెంబర్ 1న పరేడ్‌గ్రౌండ్స్‌లో జరిగే మాలల సింహగర్జన సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాలకులాల యునైటెడ్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు తల్లమల్ల కాశీనాథ్, సురేందర్, మాల మహానాడు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నర్మెట్ట మల్లేష్, మన్నె శ్రీధర్, దళిత హక్కుల రక్షణ సంఘం అధ్యక్షురాలు నగరి మంగ, రమేశ్, కృష్ణ, వెంకటేశ్, జి. యాదగిరిరావు, నర్సింగ్‌రావు, లక్ష్మణ్‌రావు, రవీందర్, లోకేష్, సదానంద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ సామగ్రి పడి కార్మికుడి మృతి

పేట్‌బషీరాబాద్: నిర్మాణంలో ఉన్న భవనం వద్ద ఓ కార్మికుడిపై సామగ్రి పడడంతో మృతి చెందాడు. ఈ సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా నందిగామ మండలం, గ్రామానికి చెందిన కొల్లి తవిటినాయుడు బతుకుదెరువు కోసం దూలపల్లికి వలస వచ్చాడు. అతడు గోవా కర్రలు కడుతూ జీవనం సాగిస్తున్నాడు. దూలపల్లిలోని సహస్ర ఓమ్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వద్ద గోవా కర్రలను తొలగిస్తుండగా ఐదు అంతస్తులో ఉన్న మరో కార్మికుడు భవన నిర్మాణ సామాగ్రిని కిందికి వేయగా, అవి నాయుడు తలపై పడడంతో అక్కడిక్కకడే మృతి చెందాడు. ఈ మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జోరుగా అక్రమ నిర్మాణాలు

- 300 గజాల స్థలంలో 8 అంతస్తుల భవన నిర్మాణం
- మామూళ్ల మత్తులో జీహెచ్‌ఎంసీ సిబ్బంది
- పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు

బర్కత్‌పుర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలోని కాచిగూడ డివిజన్‌లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. జీహెచ్‌ఎంసీ, టౌన్‌ప్లానింగ్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం కిందిస్థాయి సిబ్బంది కొందరు మామూళ్ల మత్తులో ఉండడంతో అక్రమ నిర్మాణాలు మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతున్నాయి. మూడు అంతస్తులకు అనుమతులు తీసుకుని 8 అంతస్తుల వరకూ నిర్మిస్తున్నారు. అయినా వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. డివిజన్ పరిధిలో జీహెచ్‌ఎంసీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమ నిర్మాణాలు అడ్డూఅదుపు లేకుండా సాగుతున్నాయి. భవన నిర్మాణ యజమానులు నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందోనని ఆ ప్రాంత ప్రజలు భయపడుతున్నారు. ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్న వారిని ప్రశ్నిస్తే వారు బెదిరింపులకు దిగుతున్నారని స్థానికులు వాపోతున్నారు.

బర్కత్‌పుర బస్‌డిపో వీధిలో..

బర్కత్‌పుర ఆర్టీసీ బస్‌డిపో వీధిలోని అమ్మవారి దేవాలయం వద్ద, డిపో ప్రధాన గేట్‌కు అతి సమీపంలో భవన నిర్మాణం జరుగుతోంది. అమ్మవారి ఆలయం పక్కన 300 గజాల స్థలంలో 8 అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ భవన యజమాని మూడు అంతస్తులకు జీహెచ్‌ఎంసీ నుంచి అనుమతులు తీసుకుని 8 అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నాడు. ఈ భవనానికి పక్కనే ఉన్న వెంకటరమణ అపార్ట్‌మెంట్ వాసులు జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ఈ భవన నిర్మాణ పనులను నిలిపివేశారు. అదే విధంగా ఆర్టీసీ బస్ డిపో ప్రధాన గేట్‌కు ఎదురుగా ప్రైవేట్ కళాశాల యజమాని 300 గజాల స్థలంలో 8 అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నాడు. ఈ భవన నిర్మాణం వల్ల ఆర్టీసీ బస్సుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. నిర్మాణ సామగ్రి, ఇసుక, సిమెంట్ లారీలు రోడ్డుపై నిలుపుతుండడంతో డిపో నుంచి బస్సులు రావడానికి తిరిగి డిపో వెళ్లడానికి ఆర్టీసీ డ్రైవర్లు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ భవన నిర్మాణ పనులను స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.



300 గజాల స్థలంలో 8 అంతస్తుల భవన నిర్మాణం

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



అక్రమ భవన నిర్మాణాలపై స్థానికులు ఫిర్యాదు చేస్తే జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటాం. భవన నిర్మాణ యజమానులు అనుమతి తీసుకున్న తర్వాతే నిర్మాణాలు చేపట్టాలి. నిర్మించే ప్రతీ అంతస్తుకి అనుమతి తప్పనిసరి. నిబంధనలను ఉల్లంఘించొద్దు. ఈ విషయంలో డివిజన్‌లోని ఏ ప్రాంతంలో ఇలాంటి సమస్యలు నెలకొంటే అక్కడి ప్రజలు నేరుగా తమ దృష్టికి తీసుకురావాలి.

- కన్నె ఉమాదేవి, కార్పొరేటర్, కాచిగూడ

నేడు మహాత్మాజ్యోతిరావు పూలే వర్ధంతి

రాంనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీసీల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం గురువారం ఉదయం అంబర్‌పేట ఆలీకేఫ్ చౌరస్తాలోని జ్యోతిరావుపూలే వర్ధంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీ వి.హనుమంతరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరవుతారని తెలిపారు. బడుగు, బలహీనవర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం జ్యోతిరావు పూలే ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం బీసీలందరూ పాటుపడాలని సూచించారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

సెంట్రల్ జోన్ ట్రాఫిక్ డీసీపీ అశోక్‌కుమార్

ముషీరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ చౌరస్తా నుంచి ప్రాగాటూల్స్ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపుల ఫుట్‌పాత్ ఆక్రమణలను జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు బుధవారం తొలగించారు. ఈ సందర్భంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారం చేసే వారిని పోలీసులు హెచ్చరించా రు. ఈ సందర్భంగా సెంట్రల్ జోన్ ట్రాఫిక్ డీసీపీ అశోక్ కుమార్ మాట్లాడుతూ... రద్దీ ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యలను తొలగించేందుకు ఆపరేషన్ రోప్ కార్యక్రమంలో భాగంగా రద్దీగా ఉండే ప్రాం తాలలో యుద్ధప్రాతిపాదికన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఫుట్‌పాత్‌లపై అక్రమ ని ర్మాణాలను తొలగించి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ జోన్ అడిషనల్ ట్రాఫిక్ డీసీపీ మాజీద్, ఏసీపీ ఎర్రా, ట్రాఫిక్ సీఐ వీరేశం. జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, ట్రాఫిక్ ఎస్సైలు కార్తిక్, యాదగిరి పాల్గొన్నారు.



ఆక్రమణదారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ డీసీపీ అశోక్‌కుమార్

అంబర్‌పేట రోడ్డుపై..

అంబర్‌పేట: అంబర్‌పేట రోడ్డుపై ఫుట్‌పాత్‌లను అక్రమించిన వారిపై అంబర్‌పేట ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ట్రాఫిక్ 2 డీసీపీ అశోక్‌కుమార్, సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్‌ల పర్యవేక్షణలో అంబర్‌పేట ట్రాఫిక్ సీఐ లెనిన్‌బాబు ఆధ్వర్యం లో ఆలీకేఫ్ చౌరస్తా నుంచి జిందా తిలిస్మాత్ వరకు రోడ్డుకు ఇరువైపుల ఫుట్‌పాత్‌లను అక్రమించిన వారిని తొలగించారు. ఫుట్‌పాత్‌లను అక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



గాయనీగాయకులతో త్రినాథరావు

సినీ భక్తిగీతాలు మానసిక ఒత్తిడిని దూరం చేస్తాయి

చిక్కడపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సినీ భక్తిగీతాలు మానసిక ఒత్తిడిని దూరం చేస్తాయని ప్రముఖ గాయకుడు, ఎస్‌బీఐ మాజీ ఏజీఎం చింతలపూడి త్రినాథరావు అన్నారు. ప్రముఖ మహిళా సాంస్కృతిక సంస్థ రాగరాగిణి ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో భక్తిగీతాల విభావరి జరిగింది. ప్రముఖ గాయని రమణకుమారి, సహ గాయకులు విజయకుమార్, కాసీం, ప్రభాకర్, వేణుగోపాల్, కమలాకర్‌లతో కలిసి అలనాటి సినిమాలో సుశీల, ఘంటసాల పాడిన సోలో, యుగళ గీతాలు శ్రావ్యంగా గానం చేశారు. శాస్త్రీయ సంగీత గాయని స్వర్ణ మంగళంపల్లి కర్ణాటక భక్తి పాటలు ఆలపించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న త్రినాథరావు మాట్లాడుతూ రమణకుమారి స్వయంగా మధుర గాయని అయిన సహ గాయకులకు వేదిక కల్పించాలన్న సదుద్దేశంతో రాగరాగిణి సంస్థను సోదరి సుబ్బలక్ష్మితో కలిసి ఆరంభించారని ప్రశంసించారు.

ఆలోచింపజేసిన స్వేచ్ఛ నాటకం

రవీంద్రంభారతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మనసుకు నచ్చినట్లు, ఇష్టం వచ్చినట్లు విచ్చలవిడిగా ఏదిపడితే అది చేయడం కాదు.. స్వేచ్ఛ అంటే యధేచ్ఛ కాదు అనే ఇతివృత్తంగా సాగిన స్వేచ్ఛ నాటకం ఆలోచింపజేసింది. బుధవారం రవీంద్రభారతిలో రసరంజని సంస్థ ఆధ్వర్యంలో స్వేచ్ఛ నాటకాన్ని ప్రదర్శించారు. విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ సమర్పించిన ఈ నాటకానికి మూలకథ పి.ఎస్.నారాయణ, నాటకీకరణ పరమాత్ముడి శివరాం, దర్శకత్వం బి.ఎం.రెడ్డి అందజేశారు. స్వేచ్ఛ ఎలా ఉండాలి ఎంత వరకు ఉండాలి అనే సారాంశాన్ని పంచారు. చక్కటి నటనతో కళాకారులు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రిటైర్డ్ ఐఏఎస్ డా.కేవీ రమణాచారి నటీనటులను సత్కరించి అభినందించారు. కాసేపు టికెట్ విక్రయం కేంద్రం వద్ద కూర్చున్నారు. ఇంతలో సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్ వచ్చి టికెట్ కొన్నారు. ఈ సందర్భంగా రమణాచారి టికెట్లను విక్రయించారు.

బాధితుల ఖాతాల్లోకి సైబర్ నేరగాళ్లు కాజేసిన డబ్బు

హైదరాబాద్ సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు కేసుల్లో సైబర్ నేరగాళ్లు కాజేసిన డబ్బును హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు బాధితుల ఖాతాలో జమ చేయించారు. నగరానికి చెందిన మహిళ(52)కు ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు, మనీ లాండరింగ్ కేసుల్లో తన బ్యాంకు ఖాతాలు వినియోగించారని, అరెస్ట్ తప్పదని బెదిరించారు. కేసుల నుంచి బయటపడాలంటే డబ్బు కట్టాలని భయపెట్టి ఆమె వద్ద నుంచి రూ.4,22,560 వసూలు చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో వెంటనే రంగంలోకి దిగిన సైబర్ క్రైం పోలీసులు సైబర్ నేరగాళ్ల ఖాతాను గుర్తించి ఫ్రీజ్ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు బాధితురాలి డబ్బు రూ.4,22,560 ఖాతాలో జమ చేయించారు.

- పార్ట్‌టైం జాబ్ పేరుతో నగరానికి చెందిన మహిళ (49)ను మోసం చేసిన సైబర్ నేరగాళ్లు ఆమె వద్ద నుంచి పలు దఫాలుగా రూ.7,65,110 వసూలు చేశారు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించగా.. సైబర్‌క్రైం అధికారులు మోసగాళ్ల బ్యాంకు ఖాతాను ఫ్రీజ్ చేయించారు. కోర్టు ఆదేశాల మేరకు సైబర్ నేరగాళ్లు కాజేసిన డబ్బు నుంచి రూ.4,23,667లను బాధితురాలి ఖాతాలో జమ చేయించారు.


27 రోజులుగా మృత్యువుతో పోరాటం

తుదిశ్వాస విడిచిన చిన్నారి



జస్మిత (ఫైల్)

కుషాయిగూడ: దాదాపు నెలరోజుల పాటు మృత్యువుతో పోరాడిన ఓ చిన్నారి చివరకు బుధవారం ప్రాణాలు కోల్పోయింది. ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నచర్లపల్లి వెంకట్‌రెడ్డినగర్‌లో ఉంటున్న సాయికుమార్ పార్కింగ్ ప్లేస్‌లోని తన కారులో క్యాన్‌లో తెచ్చిన పెట్రోల్‌ను పోస్తుండగా కిందపడింది. ఈనెల 1న దీపావళి పండుగ సందర్భంగా ఇంటి ముందు వెలిగించిన దీపాలకు పెట్రోల్ అంటుకొని మంటల్లో ఇద్దరు బాలికలు తీవ్రంగా గాయాలపాలయ్యారు. ఓ బాలిక యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రెండురోజుల తర్వాత మృతి చెందింది. ఇంట్లో అద్దెకు ఉంటున్న రాంబాబు కుమార్తె జస్మిత(4) అప్పటి నుంచి నీలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందినది. ప్రమాదానికి కారణమైన ఇంటియజమానిని రిమాండ్‌కు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.



కేసీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నాయకుడు

కేసీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నేత

రాంనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఎం.నాగేష్ ముదిరాజ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు నాగేష్ ముదిరాజ్ పూలమొక్కను అందించి ఆయన చే ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా నాగేష్ ముదిరాజ్ రాంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష సందర్భంగా ఈనెల 29న జరిగే దీక్షా దివస్‌ను వేడుకగా నిర్వహిస్తామన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని కేసీఆర్ పేర్కొన్నారని తెలిపారు.

కాలనీలు, బస్తీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- దశల వారీగా అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలోని కాలనీలు, బస్తీలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మున్సిపల్ డివిజన్లలో తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థ ఆధునికరణ, పార్కుల సుందరీకరణ, నూతన సీసీ రోడ్లు వంటి అభివృద్ధి కార్యక్రమాలను దశల వారిగా పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. బుధవారం నల్లకుంట డివిజన్ శంకరమఠం మెయిన్ రోడ్ నుంచి విద్యానగర్ రైల్వే ట్రాక్ వెళ్లే వీధిలో రూ. 7.25 లక్షల వ్యయంతో తాగునీటి పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ యాకర. అమృత, మాజీ కార్పొరేటర్ వనం రమేష్‌లతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నల్లకుంట డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, నాయకులు ఎం.భూపతినాథ్, జి.శంకర్, భాస్కర్‌గౌడ్, పంపరి శరత్, సీ.హెచ్.సాయిమోహన్, స్వర్ణ, మూర్తి, అనిత, సత్యనారాయణ, జెట్టి ప్రదీప్, బీజేపీ కౌన్సిల్ మెంబర్ ఎం.మధుసూదన్‌యాదవ్ పాల్గొన్నారు.



నల్లకుంటలో పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్, కార్పొరేటర్ అమృత

ముదిరాజ్ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా రమాముదిరాజ్

రాంనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా త్యాగాల రమా ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి యాదగిరి ముదిరాజ్ ఆమెకు నియామక పత్రం బుధవారం అందజేశారు. అనంతరం త్యాగాల రమా ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముదిరాజ్ మహిళల సంక్షేమానికి పాటుపడతానని పేర్కొన్నారు.



నియామకపత్రం అందుకుంటున్న రమాముదిరాజ్



దీక్షాదివస్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపాల్, వేదికపై పార్టీ నేతలు

వరద నీరు నిలవకుండా నిర్మాణ పనులు

- ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తే ప్రాంతాలలో సమస్య శాశ్వత పరిష్కారానికి నిర్మాణ పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్‌లోని వినోభానగర్ ప్రేయర్‌పవర్ చర్చివీధిలో రూ.30 లక్షలతో వరద నీరు సాఫీగా వెళ్లేందుకు నాలా, సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్, డివిజన్ కార్పొరేటర్ సుప్రీయానవీన్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వర్షాకాలంలో వినోభానగర్, పార్శీగుట్ట ప్రాంతాలలో నిత్యం సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు. సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, డివిజన్ బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు బద్రినారాయణ, కంచికుమార్ ముదిరాజ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శివ ముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, టి.శ్రీకాంత్ ముదిరాజ్,భాస్కర్‌నేత, బీజేపీ సీనియర్ నాయకులు అనిల్‌కుమార్, సత్యనారాయణ, అజయ్‌గుప్తా, నర్సింగ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- ముషీరాబాద్ డివిజన్ వైఎస్‌ఆర్ పార్కు సమీపంలోని ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రూ.3.86 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధునిక లైటింగ్ సిస్టమ్‌ను ఎమ్మెల్యే ముఠా గోపాల్ డివిజన్ కార్పొరేటర్ సుప్రీయానవీన్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు.

29న దీక్షా దివస్ జయప్రదం చేయాలి

రాంనగర్: బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ చేసిన ఆమరణ నిరాహార దీక్ష వల్లనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. కేసీఆర్ దీక్ష చేసిన రోజు నవంబర్ 29న బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో దీక్షా దివస్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం అడిక్‌మెట్ డివిజన్ లలితానగర్ కమ్యూనిటీహాల్‌లో దీక్షా దివస్ సన్నాహక సమావేశం నిర్వహించారు.

టీడీపీ సభ్యత్వానికి నగరంలో మంచి స్పందన

రాంనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వానికి నగర ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా పేర్కొన్నారు. బుధవారం దోమలగూడలోని పార్టీ నగర కార్యాలయంలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాంపల్లి నియోజకవర్గం నాయకులు లయాఖుద్దీన్, మాజీద్ అక్రమ్, మహ్మద్ గౌసుద్దీన్, జుబేదాలు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని అన్ని నియోజకవర్గాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో 30 లక్షల సభ్యత్వం టార్గెట్ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పలుస బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు ప్రకాష్, యాదగిరావు, సుక్రవేది తదితరులు పాల్గొన్నారు.